ప్రజాశక్తి

మంగళవారం 9 మే 2023 5

శ్రీ సత్యసాయి



ఈఏపీసెట్‌కు 3,37,422 దరఖాస్తులు

◆ 9న హాల్‌టికెట్లు డౌన్లోడ్ చేసుకునే అవకాశం
◆ 15 నుంచి 19 వరకు ఇంజినీరింగ్ పరీక్షలు
◆ 22 నుంచి 23 వరకు అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు
◆ ఈఏపీ సెట్ కన్వీనర్ ఆచార్య శోభాబిందు



శోభాబిందు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఎపి.ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈఏపీసెట్ -23కు సోమవారం నాటికి 3,37,422 దరఖాస్తులు అందాయని ఈఏపీసెట్ కన్వనర్ ఆచార్య శోభాబిందు, ఛైర్మన్ ఆచార్య రంగజనార్ధన తెలిపారు. సోమవారం వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ ఏపీ ఈఏపీసెట్- 2023 ప్రవేశ పరీక్షకు సోమవారం నాటికి ఇంజినీరింగ్ విభాగానికి 2,37,055 లక్షలు, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 99,388, రెండు విభాగాల్లో పరీక్ష రాయడానికి 979 దరఖాస్తులు అందాయన్నారు. ఇంతకుమునుపు ప్రకటించినట్లుగానే ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు ఈనెల 22 నుంచి 23వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. 19వ తేదీ మినహా మిగతా అన్ని తేదీల్లో ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, తిరిగి 3.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఇంజినీరింగ్ చివరి రోజు 19వ తేదీన కేవలం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మాత్రమే పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఈఏపీసెట్‌కు ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ ఈ నెల 9వ తేదీన ఉదయం 10.00 గంటల నుంచి APEAPCET-2023 వెబ్ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. హాల్‌టికెట్‌లోని వివరాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. వివరాల్లో ఏవైనా తేడాలున్నట్లయితే అభ్యర్థులు 08554-23411, 232248 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈమెయిల్ ద్వారా helpdeskapeapcet-2023@gmail.comకు మెయిల్ పంపి సరిదిద్దుకోవచ్చునని తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం బస్టాండ్ నుంచి పరీక్ష కేంద్రానికి చేరే మార్గాన్ని హాల్‌టికెట్ వెనక ముద్రించామని చెప్పారు. ఉదయం సెషన్లో అభ్యర్థులను 7.30 గంటలకు, మధ్యాహ్నం 1.30 గంటలకు పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారని తెలిపారు.

వీడని అకాల వర్షాలు..!



◆ మండువేసవిలో వానలు ◆ పంటలపై తీవ్ర ప్రభావం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా అంటేనే కరువుకు నిలయం. వర్షం కోసం వాన కాలంలోనే ఆకాశం వైపు ఎదురు చూడాల్సిన పరిస్థితులు. అయితే ఈ ఏడాది వర్షాలు మండువేసవిలోనూ పడుతుండటం గమనార్హం. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం రాయలసీమలో వర్షాలు అధికంగా పడుతాయని వాతావరణ చెబుతోంది. ఇప్పటికి ఈ ఏడాది వరుసగా వర్షాలు వేసవిలోనూ పడుతూనే ఉన్నాయి. ఇప్పుడు తాజాగా మే నెలలో అది కూడా వైశాఖ మాసంలో అత్యధికంగా ఎండలుండే సమయం. ఇప్పుడు కూడా వర్షాలు వీడటం లేదు. ఈ ప్రభావం పంటలపైనా తీవ్రంగానే ఉంటోంది.

54.7 శాతం అధికం

సాధారణంగా అనంతపురం జిల్లా అంటేనే వర్షాభావ ప్రాంతం. ఈ జిల్లాలో జూన్ నుంచి మే మొదటి వరకు కురిసే సాధారణ వర్షతం 483 మిల్లీమీటర్లు. జూన్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో పడిన వర్షపాతం 747.2 మిల్లీమీటర్లు అంటే సాధారణం కంటే 54.7 శాతం అధికంగా వర్షాలు పడ్డాయి. ఈ వర్షాలు కూడా అన్ని కాలాల్లోనూ పడటం గమనార్హం. సాధారణం సీజన్ ప్రారంభమయ్యేది నైరుతి రుతుపవనాలతో జిల్లాలో అత్యధిక వర్షపాతం ఆ కాలంలోనే అంటే జూన్ నుంచి సెప్టంబర్ మధ్యనే పడుతుంది. ఏడాది సాధారణ వర్షపాతం 483లో, నైరుతి రుతుపవనాల కాలంలోనే 319.7 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతం ఉంటుంది. ఈశాన్య రుతుపవనాల ప్రభావం చాలా తక్కువగానే జిల్లాపై ఉంటుంది. 2022 జూన్ నుంచి స్టెంబర్ కాలంలో 319.7 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికిగానూ 449.5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. సాధారణం కంటే 40.5 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. అక్టోబర్ నుంచి డిసెంబరు వరకు ఈశాన్య రుతుపవనాల కాలంలో సాధారణ వర్షపాతం 139.3 మిల్లీమీటర్లు అయితే 198.8 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 42.7 శాతం అధికంగా పడింది. ఇక చలికాలం జూన్, ఫిబ్రవరి మాసాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదయ్యింది. ఈ రెండు మాసాల్లో 2.6 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతమయితే పడింది కేవలం 0.1 మిల్లీమీటరు. ఇక వేసవి మార్చి నుంచి మే వరకు చూస్తే సాధారణ వర్షపాతం 21.4 మిల్లీమీటర్లు అయితే పడింది 99.3 మిల్లీమీటర్లు కావడం గమనార్హం. ఇది సాధారణం కంటే 364 శాతం అధికంగా పడింది. మార్చి నెలలో సగటున 13.5 మిల్లీమీటర్లు, ఏప్రిల్‌లో 30.2 మిల్లీమీటర్లు మే నెలలో 55.6 మిల్లీమీటర్లు ఇప్పటి వరకే పడింది.

అకాల వర్షాలతో రైతులకు తీరని నష్టాలు

అకాల వర్షాలు రైతులకు నష్టాలనే మిగులుస్తున్నాయి. మార్చి నెలలో బలమైన ఈదురు గాలులతోపాటు, పెద్దఎత్తున వడగండ్ల వాన పడింది. ఈ సమయంలో ఉద్యానవన పంటలకు తీరని నష్టం చేకూర్చింది. సుమారు రూ.220 కోట్ల మేరకు పంటనష్టం వాటిల్లింది. తాజాగా ఇప్పుడు పడుతున్న వర్షాలు అదే తీరున ఉన్నాయి. వరి, మొక్కజొన్న తదితర పంటలు కలిపి సుమారు నాలుగు కోట్లకుపైగా పంటనష్టం మిగిల్చింది. ఉద్యావన పంటలకు సంబంధించి రూ.1.33 కోటి నష్టం వాటిల్లింది. ఇంకా వర్షాలు పడుతూనే ఉండటంతో రైతులు గుబులు నెలకొంది. తాజాగా సోమవారం రాత్రి కూడా పెద్దఎత్తున వర్షాలున్నట్టు వాతావరణ శాఖ చెబుతుండటం రైతుల్లో గుబులు రేపుతోంది.



బొమ్మనహాల్‌లో వర్షానికి తడిసి ముద్దయిన వడ్లు

రైతులను ముంచిన వర్షాలు.. భారీగా పంట నష్టం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఇటీవల కురిసిన వర్షాలు అన్నదాతలను నట్టేట ముంచాయి. దీంతో రైతులకు అపార పంట నష్టం వాటిల్లింది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు వరి, మొక్కజొన్న, వేరుశెనగ, పత్తి తదితర పంటలు సాగు చేశారు. అయితే ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురవడంతో భారీగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో 3.7 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ సిబ్బంది తెలిపారు. రైతులు కోత మిషన్లతో వరి పంటను కుప్ప చేసి ఆరబెట్టుకున్న సమయంలో వర్షాలు కురవడంతో వడ్లు తడిసి ముద్దయి మొలకలు వచ్చాయి. వారం రోజుల నుంచి వరి ధాన్యాన్ని ఆరబెట్టిని సంచుల కొరత కారణంగా వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడం, ప్రభుత్వం సహకరించకపోవడంతో పూర్తి పంట నష్టపోయామని కష్టాలే మిగిలాయని రైతులు వాపోతున్నారు. మొలకెత్తిన పంటను ప్రస్తుతం ఉన్న ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ఇక పత్తి పైరులో నీరు నిలిచి వేరు కుళ్లిపోవడంతో రైతులు ఎకరాకు రూ. 50 వేల నష్టపోయారు. ఓ వైపు వర్షాలు, మరో వైపు రసాయన ఎరువులు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రిమిసంహారక మందుల కోసం పక్క రాష్ట్రమైన కర్నాటకలోని బళ్లారికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్‌బీకేల్లో ఎరువులు, మందుల కొరత తీవ్రంగా ఉందని, దీనికితోడు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలు ఎవరికి మొర పెట్టుకోవాలో తెలియడం లేదంటున్నారు. ముఖ్యంగా భూసార పరీక్షల విషయంలో దిక్కుతోచక అవగాహన రాహిత్యంతో ఏదో ఒక పంట సాగు చేసి నష్టపోతున్నారు. కొల్లగానహళ్లి, బండూరు, బల్లనగుడ్డం, కురవల్లి సచివాలయాల్లో సిబ్బంది కొరత వల్ల రైతులు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులను బళ్లారిలో దుకాణదారుల సలహా మేరకే కొనుగోలు చేసి పంటలకు వినియోగిస్తున్నారు. స్థానికంగా ఎరువులు కొనుగోలు చేసి పంటకు పిచికారి చేయగా అవి వారమైనా కరగలేదని అలాంటి దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రాబోయే రోజుల్లో వర్షాల సమాచారం ముందుగానే ఇచ్చి రైతులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే చేతికొచ్చిన పంట నోటికి అందకుండా పోయి రైతులకు నష్టాలు తప్పవు.



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజలు సంతృప్తి చెందేలా

గ్రీవెన్స్ అర్జీలకు పరిష్కారం

జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్పందన కార్యక్రమంలో ఇచ్చే అర్జీలకు ఫిర్యాదుదారులు సంతృప్తి చెందే విధంగా అధికారులు పరిష్కార మార్గాలను చూపాలని జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. సోమవారం నాడు కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖతో వివిధ శాఖల అధికారులతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 221 మందితో అర్జీలను స్వీకరించారు. అనంతరం జెసి మండల, డివిజన్ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 1700 పైగా స్పందనలో వచ్చిన అర్జీదారులకు ఫోన్ చేసి సమస్యల పరిష్కారంలో సంతృప్తి చెందారా అని అడిగామన్నారు. దాదాపు 1200 మందికిపైగా అర్జీదారులు వారు సంతృప్తి చెందలేదనే సమాధానం చెప్పారన్నారు. ఇందులో ఎక్కువగా రెవెన్యూకు సంబంధించిన అర్జీలు ఉన్నాయన్నారు. దాని తర్వాత గహ నిర్మాణం, సర్వే, పంచాయతీరాజ్, వ్యవసాయ తదితర శాఖల కు చెందినవి ఉన్నాయన్నారు. ఆయా శాఖల అధికారులు గడువులోగా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలపై జిల్లాలోని అన్ని మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించామని చెప్పారు. ఈ ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు ఆ ప్రాంతాల్లో పర్యటించి పర్యవేక్షించాలన్నారు. జిల్లా పరిషత్ సమావేశంలో వచ్చిన సమస్యలు పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ విజయ్ కుమార్, గహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, పిఆర్ఎస్ఇ గోపాల్ రెడ్డి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిపిఓ విజయ్ కుమార్, డిఎంహెచ్ఒ కష్ణారెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, డ్వామా పీడీ రామాంజనేయులు, పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

సబ్‌కలెక్టర్‌కు వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు ఆధ్వర్యంలో వ్యక్తిగత అర్జీలతో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.గంగాధర్ మాట్లాడుతూ పెనుకొండ మున్సిపాలిటీగా అభివృద్ధి చెందిన తర్వాత సొంతిల్లు లేని నిరుపేదలు రోజు వారి కూలి పనులు చేసుకొని ఇంటి అద్దె కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికి తోడు ఈ ప్రాంతంలో కియా పరిశ్రమ రావడంతో ఇంటి అద్దెలు అమాంతం పెరిగాయన్నారు. అధికారులు స్పందించి వెంటనే ఇంటి స్థలాలు కేటాయించి పక్కా ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని, లేనిచో వ్యవసాయ కార్మిక సంఘం ఆధర్వంలో పట్టణంలో ఉన్న నిరుపేదలను పెద్దఎత్తున సమీకరించి ప్రభుత్వ స్థలాల్లో ఎర్రజెండాలు పాతుతామని తెలిపారు. దీనిపై సబ్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ విచారణ చేసి అర్జీ పెట్టుకున్న ప్రతి నిరుపేదకు 90 రోజుల్లోగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇంటి స్థలం లేని పేదలు ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇల్లు లేని పేదలు 80 మంది, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తిప్పన్న, పేదలు గోవిందప్ప, మంగమ్మ, అలివేలమ్మ, నాగమ్మ, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పెనుకొండ: పట్టణంలో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకూ జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో గోడపత్రికలు, ప్రచార పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు 9వ తేదీ పంచామత అభిషేకంతో ప్రారంభమై 14వ తేదీ విశ్వరూప దర్శనంతో ముగుస్తాయన్నారు. ఏటా హరినాథ్ కుటుంబ సభ్యులు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పెనుకొండ ప్రాంతంలోని ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు రామకృష్ణమాచార్యులు, రమేష్ స్వామి, యాడికి నాగరాజు, ప్రగతి శ్రీనివాసులు, పూర్ణచంద్ర, రంగనాథ్, పాల్గొన్నారు.

ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజు పల్లి ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత గల విద్యార్థులు ఈనెల 9వ తేదీ నుండి 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు 75 రూపాయలు, ఓసి బిసి విద్యార్థులకు 150 రూపాయలు చెల్లించాలన్నారు. 2022- 23 విద్యా సంవత్సరంలో ఐదవ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలని చెప్పారు. ఆరవ తరగతి చేర్చుకొనుటకు జూన్ 11న 10 గంటల నుండి 12 గంటల వరకు జగరాజు పల్లి ఆదర్శ పాఠశాలలో అర్హత పరీక్ష నిర్వహించనున్నామని తెలిపారు.

లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలి

ఓబుల దేవర చెరువు: మండలవ్యాప్తంగా ఉన్న జగనన్న గహ లబ్దిదారులకు సిమెంట్, బిల్లులు చెల్లించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపార్టీ నాయకులు సోమవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఓ పోలపపకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యదర్శి చలపతి, నాయకులు రమణ, రవి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

ముందస్తు అడ్మిషన్ల కోసం విస్తృత ప్రచారం చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ బాలాంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈరేష్ మాట్లాడుతూ మడకశిర మండల వ్యాప్తంగా ప్రయివేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ప్రచారం చేస్తున్నా మండల విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మడకశిర ప్రభుత్వ కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం రెండూ ఉన్నాయని, తరగతి గదుల్లో సీసీ కెమెరాల నిఘాతో పాటు అమ్మాయిలకు ప్రత్యేక హాస్టల్ సదుపాయం ఉందన్నారు. కావున తల్లిదండ్రులు ప్రయివేట్ కళాశాలల వలలో పడి మోసపోవద్దని సూచించారు. ముందస్తు అడ్మిషన్ల కోసం ప్రచారం చేయకూడదని ప్రభుత్వ జీఓ ఉన్నా ప్రయివేటు విద్యాసంస్థలు బేఖాతరు చేస్తున్నాయని మండిపడ్డారు. ఓ ప్రయివేట్ పాఠశాల యాజయాన్యం ఇప్పటికే అడ్మిషన్లు చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తుందని, ఇకనైనా వారు పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే ఆ పాఠశాల ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించా రు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, పవన్, హరి, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ బాలాంజనేయులకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎ నాయకులు

ఇన్‌ఛార్జి కార్యదర్శిగా రామ్‌గోపాల్ రెడ్డి

కొత్తచెరువు :.కొత్తచెరువు గ్రామపంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా రామ్ గోపాల్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు ఇక్కడ పనిచేస్తున్న కార్యదర్శి గోపాల్ సెలవు పై వెళ్లడంతో తలమర్ల గ్రామ కార్యదర్శిని ఇంచార్జ్ కార్యదర్శిగా నియమించారు.

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే

కదిరి టౌన్ : వైసిపి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధారెడ్డి అన్నారు. రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లి 1, 2 గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు కో ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, జెసిఎస్ ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుడికి పరామర్శ

కదిరి టౌన్ :కదిరి మాజీ మున్సిపల్ చైర్మన్ ఫర్హాన ఫయాజ్ భర్త వేముల ఫయాజ్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న వైసిపి సిఇసి సభ్యులు పూల శ్రీనివాస్ రెడ్డి ఫయాజ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం : నల్లచెరువు మండలం ఉప్పార్లపల్లికి చెందిన మహబూబ్ బాషా ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. దీంతో పూల శ్రీనివాసరెడ్డి మహబూబ్‌బాషాను పరామర్శించి రూ. 10వేలను అందజేశారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి

పెనుకొండ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం దళిత సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్అండ్‌బి అతిథి గహం వద్ద సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాది శివరామకృష్ణ మాట్లాడుతూ సంజీవయ్య రాష్ట్రాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డివిజన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు ఏ.వెంకటేశులు, దండోరా రామాంజనేయులు, రామకృష్ణ, సూర్యనారాయణ, కె.రవి, టెంపో శ్రీనివాసులు, కోళ్లప్ప, ఎం.నరసింహులు, మునిమడుగు నరసింహులు, తిమ్మాపురం కదిరిప్ప, కోనాపురం మారుతి, నాయకులు పాల్గొన్నారు.

సరిహద్దులో మద్యం దుకాణాలు బంద్

రొద్దం: కర్నాటకలో విధానసభ ఎన్నికల నేపథ్యంలో కర్నాటకతో పాటు ఆంధ్రలోని సరిహద్దు గ్రామాల్లో సోమవారం సాయంత్రం మద్యం దుకాణాలను బంద్ చేయించారు. ఇందులో భాగంగా రొద్దంలో ఉన్న మద్యం దుకాణాన్ని మూసి వేశారు. రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు తెరిచే పరిస్థితిలేదు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

రొద్దం: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టిడిపి నాయకులు విమర్శించారు. మండల పరిధిలోని క్లస్టర్-1 ఇన్‌ఛార్జి నాగేంద్ర ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రమైన రొద్దంలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి మురళి, మాజీ ఎంపీటీసీ చంద్ర, దాసరి రామంజి, నజీర్, తురకలపట్నం శ్రీరాములు, కార్యకర్తలు, టిడిపి కుటుంబ సభ్యులు ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై వివరించారు.

11న మండల మీట్

గాండ్లపెంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 11వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ అంజినప్ప తెలిపారు. మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని ఎస్ఐ శ్రీధర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రంగారెడ్డి పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో చెన్నేకొత్తపల్లి శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం అతిథులు ఎస్ఐ, రిటైర్డ్ హెచ్ఎం ప్రారంభించారు. ఈ సంర్భంగా వారు సరస్వతి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రంగారెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా చేయకుండా ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి క్రిష్ణయ్య, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: స్థానిక గ్రంథాలయంలో సోమవారం ముఖ్య అతిథులుగా హాజరైన ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కిష్టప్ప వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు చిన్నతనం నుంచే గ్రంథాలయాల పట్ల ఆకర్షితులు కావటానికి వేసవి విజ్ఞాన శిబిరాలు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మెహబూబ్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.



సోమందేపల్లిలో సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

రొద్దం: మండలంలో ఉన్న శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించినట్లు గ్రంథాలయ అధికారి నాగరాజు తెలిపారు. ముఖ్య అతిథి విశ్రాంత ఉపాధ్యాయుడు లక్ష్మిరెడ్డి, ఉపాధ్యాయులు సి.రామాంజినేయులు, ఓబులేసు ముందుగా సరస్వతి పూజ చేసి ప్రార్థనతో శిబిరాన్ని ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి నాగరాజు మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో జూన్ 11 వరకు వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

మడకశిర రూరల్: మడకశిర పట్టణంలోనే గ్రంథాలయంలో సోమవారం ముఖ్యఅతిథి ఎంఈఓ భాస్కర్ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించామని గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ గ్రంథాలయంలో నూతనంగా వచ్చిన పుస్తకాలను ఆవిష్కరించారు.

పెనుకొండ: స్థానిక గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించామని గ్రంథాలయ అధికారి వేణు గోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సోమందేపల్లి మ్యాథ్స్ టీచర్, విశ్రాంత ఏఎస్ఐ, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు వేసవి సెలవులు వథా చేయకుండా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బత్తలపల్లి: పుస్తక పఠనం అలవర్చుకుంటే విజ్ఞానం పెంపొందించుకోవచ్చునని బత్తలపల్లి శాఖ గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు ఆటవిడుపుతోపాటు, చిత్రలేఖనం, పుస్తక పఠనం ఉంటుందని దీనివల్ల విజ్ఞానం పెంపొందించుకోవచ్చునని అన్నారు. గ్రంథాలయ అధికారిణితోపాటు, టీచర్ రేష్మ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కదిరి నియోజకవర్గంలో తహశీల్దార్లు లేరు..

అన్ని మండలాల్లో ఇన్‌ఛార్జులే దిక్కు
పరిష్కారం కాని సమస్యలు
ఇబ్బందుల్లో ప్రజలు



కదిరి తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి కదిరి టౌన్

కదిరి నియోజకవర్గంలోని పలు మండలాల్లో రెవెన్యూ శాఖలో ఇన్‌ఛార్జుల పాలన చాలా కాలంగా కొనసాగుతోంది. ఆయా మండలాల్లో రెగ్యులర్ తహశీల్దార్లు లేకపోవటంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో పలు సమస్యలతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని సత్వరమే వారి సమస్యలు పరిష్కరించాలని స్వయాన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పలుమార్లు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావటంలేదు. కదిరి నియోజవర్గంలో రెవెన్యూ సేవలు మందగిస్తున్నాయి. మండలాల్లో ప్రజలకు సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందడం లేదు. భూ సర్వేలు, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, అడంగల్ నమోదు, వన్ బి లో మార్పులు చేర్పులు వంటి పనుల్లో తీవ్ర జాప్యం కనిపిస్తోంది. జనం పెట్టుకున్న అర్జీలు నెలల తరబడి పరిష్కారానికి నోచుకోవటం లేదు. కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్న ఫైళ్లకు వారాల తరబడి మోక్షం లభించడం లేదు. మండల కేంద్రాల్లో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగలేక జనం అల్లాడిపోతున్నారు. నూతన జిల్లా కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

కదిరిలో... కదిరికి 18 నెలలుగా రెగ్యులర్ తహశీల్దార్ లేకపోవడంతో ఇన్‌ఛార్జుల పాలన కొనసాగుతోంది. ఇక్కడ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా ఉన్న ముకుంద రాజకీయ ఒత్తిళ్లతో దీర్ఘకాలిక సెలవులో వెళ్ళినట్లు సమాచారం. ప్రస్తుతం బుక్కపట్నం తహశీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న నటరాజకు కదిరి ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. వివిధ రకాల సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలు అధికారులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకులో రుణాల రెన్యువల్‌కు వన్‌బి లో మార్పులు చేర్పులు కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సకాలంలో పనులు కాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు కొత్త పాసుబుక్కులకు దరఖాస్తు చేసుకున్న రైతులు వాటి కోసం ఎదురు చూడక తప్పలేదు. విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలు కోసం కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. కదిరి పెద్ద మండలం కావడంతో ఇక్కడ రెగ్యులర్ తహశీల్దార్‌ను నియమించి సమస్యలు పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నల్లచెరువు, తనకల్లులో ఇదే పరిస్థితి.. నల్లచెరువు, తనకల్లు మండలాల్లో రెగ్యులర్ తహశీల్దార్ లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. తనకల్లులో డిప్యూటీ తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న మధు తనకల్ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా ఉంటూ, నల్లచెరువు తహశీల్దార్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఆయా మండలాల ప్రజలు పెట్టుకున్న అర్జీలకు నెలలు తరబడి పరిష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గాండ్లపెంటలో ఇన్‌ఛార్జి పాలన.. గాండ్లపెంట డీటీగా విధులు నిర్వహిస్తున్న రవి ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రెగ్యులర్ తహశీల్దార్ లేకపోవడంతో మండల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు.

ఎన్ పి కుంటలో డీటీనే దిక్కు.. జిల్లా సరిహద్దు ప్రాంతమైన నంబుల పూలకుంట మండలంలో తహశీల్దార్ లేకపోవడంతో డీటీగా విధులు నిర్వహిస్తున్న రవినాయక్ ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మారుమూల ప్రాంతంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కాక ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

తలుపులలో మూడేళ్లుగా తహశీల్దార్ పోస్ట్ ఖాళీ.. తలుపుల మండలంలో మూడేళ్లుగా తహశీల్దార్ పోస్ట్ ఖాళీగా ఉండడంతో ఆ మండల ప్రజల పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వివిధ పనులు నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు తమ పనులు కాక విసిగెత్తిపోతున్నారు. వారు అర్జీల రూపంలో పెట్టుకున్న సమస్యలు పరిష్కారం కాక అవస్థలు పడుతున్నారు. రెగ్యులర్ తహశీల్దార్‌ను నియమించాలని పలుమార్లు మండల ప్రజలు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డీటీగా విధులు నిర్వహిస్తున్న మునిస్వామి ఇన్‌ఛార్జి తహశీల్దార్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

కలెక్టర్ స్పందించాలి.. కదిరి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో రెగ్యుల్ తహశీల్దార్లు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి జిల్లా నూతన కలెక్టర్ అరుణ్ బాబు స్పందించాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు. ప్రజల ఇబ్బందులను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. వెంటనే స్పందించి ఆయా మండలాలకు రెగ్యులర్ తహశీల్దార్లను నియమించాలని కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

రొద్దం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్ పక్కన ఉన్న నూతన ఎస్సీ కాలనీకి చెందిన రాజేష్(26) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. రాజేష్‌కు మూడేళ్ల క్రితం కర్నాటకలోని జాజురాంపల్లి గ్రామానికి చెందిన హారతితో వివాహమైంది. అయితే 8 నెలలకే వారు విడాకులు తీసుకొన్నారు. దీంతో మానసిక వేదనకు గురైన రాజేష్ ఇంటి సమీపంలో ఉన్న తన షెడ్డులో పైకప్పునకు ఉరి వేసుకొన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ నాగ స్వామి సంఘటనా స్థలానికి చేరుకొని మతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెళ్లి చేసుకుంటానని మోసం...

న్యాయం కోసం పోలీసులకు యువతి ఫిర్యాదు

హిందూపురం : ముంబాయికి చెందిన ఒక యువతిని హిందూపురం పట్టణంలో నివాసం ఉంటున్న ప్రముఖ వ్యాపార వేత్త తమ్ముడు ఎంహెచ్ అబ్దుల్లా కుమారుడు ఇర్ఫాన్ మోసం చేశాడని ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని బాధిత యువతి సోమవారం పట్టణంలోని వన్ టౌన్ స్టేషన్ ముందు నిరసన తెలిపి, సిఐ ఈరన్నకు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆ యువతి మీడియాతో మాట్లాడుతు శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో నివాసం ఉంటున్న ఎంహెచ్ అబ్దుల్లా, ఎంహెచ్ రీహానా తమకు బంధువులు కావడంతో తరచు కుటుంబ సమేతంగా ముంబయి నుంచి హిందూపురం వచ్చే వారమన్నారు. అదే కుటుంబంలో ఉన్న ఇర్ఫాన్‌తో తనకు పరిచయం ఏర్పడిందని, ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారిందని అన్నారు. కొన్ని సంవత్సరాలుగా ప్రేమించుకున్నామని చెప్పారు. ఆ సమయంలో తనను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడన్నారు. ఈ నేపథ్యంలో తనను వివాహం చేసుకోమని పలుమార్లు అడిగినప్పటికి ఈ రోజు..రేపూ అంటు కాలయాపన చేశాడన్నారు. చివరకు పెళ్లి చేసుకోవాలని నిలదీయడంతో అసలు విషయం చెప్పాడన్నారు. తనను వివాహం చేసుకుంటే ఇర్ఫాన్ తల్లి విషం తాగి ఆత్మహత్య చేసుకుంటానని బెదరించిందని, అందుకోసమే తనను వివాహం చేసుకోవటం లేదని చెప్పాడన్నారు. బంధువులు ఎవరు తనకు న్యాయం చేయరని తెలిసి న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించినట్లు చెప్పారు. తనకు న్యాయం జరగక పోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకోంటానని బాధిత యువతి ఈసందర్భంగా హెచ్చరించింది.

ప్రమాదంలో గాయపడిన చిన్నారి మృతి

బత్తలపల్లి : మండలంలోని పోట్లమర్రి సమీపంలో మార్చి 17న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి ఆదివారం రాత్రి మృతిచెందినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు. మార్చి 17న ఆటో, బొలెరో వాహనం ఢీ కొన్న ప్రమాదంలో ఆరుగురు మృతిచెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో ధర్మవరం పట్టణానికి చెందిన షాహిస్తా(8) అనే చిన్నారి చెన్నైలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహర్ష తెలిపారు.



బత్తల హరిప్రసాద్‌ను జాతరకు ఆహ్వానిస్తున్న గ్రామస్తులు

జాతర నిర్వహణకు విరాళం

కదిరి టౌన్ : గాండ్లపెంట మండలకేంద్రంలో నిర్వహించే గంగా భవాని జాతర నిర్వహణకు వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ విరాళం అందజేశారు. ఆలయ 15వ వార్షికోత్సవం సందర్భంగాఉత్సవ విగ్రహం ఊరేగింపులో పాల్గొనాలని ఆలయ కమిటీసభ్యులు బత్తల హరిప్రసాద్‌ను, సీనియర్ నాయకులు బత్తల వెంకటరమణను సోమవారం కలసి ఆహ్వానించారు. ఈ మేరకు జాతర నిర్వహణకు తనవంతుగా బత్తల హరిప్రసాద్ రూ.15వేలు విరాళం అందజేశారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

బుక్కపట్నం : చెట్లను కాపాడి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మయ్య, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు భాస్కర్ నాయుడు తెలిపారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ చంద్రమోహన్, అధ్యాపకులు ఓబయ్య, వెంకటేష్ ప్రసాద్, వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా సర్వే పూర్తిచేయాలి

హిందూపురం : ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వెల్ఫేర్, మహిళా పోలీస్ సెక్రటరీలు ఎస్‌డిజి సర్వేను పూర్తి చేయాలని, అమ్యూనిటి సెక్రటరీలు అందరికి ఇళ్లు పథకంలో భాగంగా నిర్మాణం చేస్తున్న ఇండ్లను పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం సెక్రటరీలతో ఈ విషయంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్‌డిజి సర్వే చేయడంలో హిందూపురం పురపాలక సంఘం వెనుకబడి ఉందన్నారు. వెంటనే సర్వేను పూర్తి చేయాలన్నారు. పురపాలక సంఘంలో కొట్నూరు, కొటిపి లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగ వంతంగా పూర్తి జరిగే విధంగా చూడాలన్నారు. దీనిపై ప్రతి వారం మున్సిపల్ కార్యలయంలో సమీక్షా సమావేశం నిర్వహించి, ఎప్పటికప్పుడు పనులను సైతం పరిశీలన చేస్తామన్నారు. ఈ సమావేశంలో డిఇఇ నీరజ, హౌసింగ్ డిఇఇ శివకుమార్ నాయక్, మున్సిపల్ అధికారులు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

డీఎడ్ కళాశాలల రెన్యువల్‌కు అవకాశం

బుక్కపట్నం : జిల్లాలోని ప్రయివేటు డిఇడి కళాశాలల యజమానులు తమ కాలేజీల రెన్యువల్ చేసుకోవాలని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డైట్ సెట్ నిర్వహణకు అనుమతి ఇచ్చిందని, కావున జిల్లాలోని ప్రవేట్ డిఇడి కళాశాలల యజమానులు తమ కాలేజీ రెన్యువల్ చేసుకోవాలని చెప్పారు. రెన్యువల్ చేసుకున్న వాటిని 16వ తేదీ లోపు ప్రభుత్వ డైట్ కళాశాలలో అందజేయాలని అప్లికేషన్ ఫీజును నేషనల్ బ్యాంక్ ద్వారా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అమరావతి పేరు మీద చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ డైట్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

10న పాలిసెట్

హిందూపురం : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి గాను పాలీసెట్–2023 ప్రవేశ పరీక్ష ఈ నెల 10న నిర్వహించనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, పాలీసెట్ కో ఆర్డినేటర్ హరీష్ బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతు పాలీ సెట్‌కు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారన్నారు. ఈ పరీక్షకు హిందూపురంలో 2555 మంది హాజరు అవుతున్నట్లు తెలిపారు. పట్టణంలో మొత్తం మొత్తం ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశ పరీక్ష ప్రారంభమైన ఉదయం 11 గంటల తర్వాత ఒక నిమిషం ఆలస్యమైన అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించమని చెప్పారు.

పది తప్పిన విద్యార్థులకు ఉచిత శిక్షణ

కదిరి అర్బన్ : పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు మండల పరిధిలోని కుమ్మర వాండ్లపల్లి గ్రామంలో గల "స్పేస్" కళాశాల ఆవరణలో "మానసధార" సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎమ్మెస్ ప్రశాంత్ మరియు ఎమ్మెస్ కిరణ్ ల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గణితము, సామాన్య శాస్త్రంలో 20 రోజులపాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు రోటరీ క్లబ్ సహాయ కార్యదర్శి చెన్నూర్ తాహెర్ వలి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ఈనెల 11న ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు శిక్షణ ప్రదేశానికి చేరుకోవడానికి బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని ఈ అవకాశాన్ని కదిరి ప్రాంతంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఉపాధ్యాయులు సోమశేఖర్, దివాకర్, రామకృష్ణ , జయచంద్ర నాయక్, రామాంజనేయులుచే విద్యా బోధన అందిస్తున్నట్లు వారు తెలిపారు. మరిన్ని వివరాలకు 9494435977, 7989778323, 9441553150, 8897297295 నెంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

హిందూపురం : కొత్తగా ఆధార్ కావాలన్నా, కార్డుల్లో దొర్లిన తప్పొప్పులను సరి చేయించుకోవాలనుకున్నా, ఫొటో, సెల్ నంబరు వివరాలను మార్పించాలనుకున్నా గతంలో వార్డు ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని, వారి ఇబ్బందులను గుర్తించి వార్డు లోనే ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించామనికౌన్సిలర్ జయరాములు పేర్కొన్నారు. సోమవారం వార్డ్ పరిధిలో సచివాలయంలో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ అప్‌డేట్ (డెమో గ్రాఫిక్)కు రూ.50, బయోమెట్రిక్ అప్‌డేట్‌కు రూ.100 రుసుం తీసుకుంటారన్నారు. కార్డు ప్రింట్ కు రూ.30 వసూలు చేయనున్నారన్నారు. కొత్తగా కార్డు తీసుకునే వారికి ఎలాంటి రుసుం ఉండదని అందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సెక్రటరీ మహేష్, సచివాలయ సెక్రటరీలు, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.



'పది'ఫలితాల్లో కాకతీయ విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పదిఫలితాల్లో స్థానిక కాకతీయ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో అగ్రగామిగా నిలిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ శెట్టిపి నిర్మల జయచంద్రారెడ్డి తెలిపారు. పాఠశాలలో 48 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 48 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇందులో టి.భవిష్యరెడ్డి 583, చంటి 582, బిందు 579, కౌశికరెడ్డి 570, జ్ఞానేశ్వర్ 569 చంద్రకాంత్‌రెడ్డి 561, మైత్రిరెడ్డి 559, మహితాశ్రీ 555, హారిక 554, నవదీప్ 553 మార్కులు సాధించారన్నారు. దీంతో ప్రతిభ కనబరచిన విద్యార్థులను కరస్పాండెంట్ తోపాటు పౌండర్ శెట్టిపి రామిరెడ్డి, డైరెక్టర్లు సూర్యప్రకాశ్ రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్తమ ఫలితాలకు నిలయం.. అమర్ విద్యామందిర్

ప్రజాశక్తి- పరిగి

ఇటీవల విడుదలైన పదోతరగతి పరీక్ష ఫలితాలలో పరిగి అమర్ విద్యా మందిర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మండలంలో ప్రత్యేకతను చాటుకున్నట్లు పాఠశాల వ్యవస్థాపకులు ఇబ్రహీం తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు రజియా సుల్తానా584, భావన 580, మిస్బా 578 మార్కులు సాధించారన్నారు. అత్యుత్తమ విద్యాభ్యాసం అందిస్తున్న పాఠశాలగా తమ పాఠశాల 15 సంవత్సరాలుగా పేరు సంపాదించిందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పోటీ విధానాలకు అనుగుణంగా బోధన అందిస్తూ ఉత్తమ ఉపాధ్యాయుల ద్వారా సాంకేతిక విజ్ఞానంతో విద్యను అందించడం వల్లే ఇలాంటి ఫలితాలు సాధించామని ఆయన వెల్లడించారు. తమ పాఠశాలలో 12 మంది విద్యార్థులు 500 మార్కులకు పెగా, 17 మంది విద్యార్థులు 400 మార్కులకు పైగా సాధించారనిబ ఇబ్రహీం తెలిపారు.



రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను విస్తరిస్తాం



హెల్త్‌కిట్ల పంపిణీలో సొసైటీ చైర్మన్, తదితరులు

పరిగి : జిల్లా వ్యాప్తంగా రెడ్ క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తరింపజేస్తామని తద్వారా ప్రతి గ్రామంలోనూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నదే తమ లక్ష్యమని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జీఎంసి. శేఖర్ తెలిపారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం పరిగి మండలం ఎర్రగుంట లో 25 కుటుంబాలకు హెల్త్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ ఈ సొసైటీ ద్వారా విద్య ఆరోగ్యం మాత్రమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలు అనంతరం కంటి అద్దాలను అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ సేవలను గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించి మరిన్ని సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట సర్పంచి బాలకష్ణ, జిల్లా సెక్రటరీ, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ వసంత్, జిల్లా కోఆర్డినేటర్ రమేష్, బంగారు చంద్ర, శివప్ప, రవితేజ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఉదయ్, సాయి, శ్రీనివాసులు, మూర్తి, నాగేష్, శ్రీనివాసులు, నవీన్, మంజు, జగదీష్, వినయ్ ఆసుపత్రి సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : రెడ్‌క్రాస్ ఆశయాలు, సేవా గుణాన్ని అంతటా విస్తరింప చేస్తామని రెడ్ క్రాస్ సంస్థ జీవిత కాల సభ్యులు డాక్టర్ నరసింహులు, జిల్లా వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని మధు కంటి వైద్యశాలలో సోమవారం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ పద్మలత, డాక్టర్ నజీర్, రెడ్ క్రాస్ సంస్థ జీవితకాలపు సభ్యులు డాక్టర్ సత్య పాల్గొన్నారు.

హిందూపురం : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ డిస్ట్రిక్ట్ సెక్రటరీ, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ వసంత్, డిస్టిక్ కోఆర్డినేటర్ రమేష్, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, డాక్టర్ వెంకటరమణ, అసుపత్రి మెడికల్ సుపరింటెండెంట్ రోహిల్, రవితేజ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : రెడ్‌క్రాస్ సంస్థ సేవలు అనన్యమైనవని ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ నజీర్ పేర్కొన్నారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ ఆవిర్భావం గురించి వివరించారు.

ఆశావర్కర్ల సమస్యలపై జాయింట్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్


శ్రీ సత్య సాయి జిల్లా ఆశావర్కర్ల సమస్యలపై జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు, ఆశా వర్కర్ల సంఘం నాయకులు, జాయింట్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో గత నెలలో ఆశా వర్కర్ల ధర్నా కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఇచ్చిన హామీలను నెరవేర్చే విషయంపై చర్చించారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలు, ఆశావర్కర్ల సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారం కాకపోతే తిరిగి జరిగే సమావేశంలో తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు పలు డిమాండ్లను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, సిఐటియు ఆశా వర్కర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సాంబశివ, ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షులు త్రివేణి, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్య, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు మోసం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రతిఏటా జనవరిలో జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తానన్న సిఎం జగన్ నిరుద్యోగులను నిలువునా మోసం చేశారని తెలుగుయువత, టిఎన్ఎస్ఎఫ్, ఐటిడిపి నాయకులు విమర్శించారు. నిరుద్యోగులకు జ్యాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్న డిమాండ్‌తో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్, ఐటిడిపి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కళాజ్యోతి సర్కిల్లో రోడ్డుపై బైటాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది జనవరిలో జాబా క్యాలెండర్ విడుదల చేస్తానన్న సిఎం జగన్ నిరుద్యోగులతో చెలగాటమాడుతున్నారన్నారు. వలంటీర్ ఉద్యోగాలతో సరిపెట్టుకుని ఆ వాలంటీర్లు కూడా వైసీపీ పార్టీకి పనిచేసే విధంగా పెట్టుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్రంలో అనేక మంది యువకులు వారి చదువులు పూర్తి చేసి రాష్ట్రంలో ఉద్యోగాలు లేక పక్కరాష్ట్రాలకు ఉద్యోగుల కోసం వలసవెళ్లే పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో నిరసన కారుల వద్దకు ఎస్ఐ మహమ్మద్ రఫీ సిబ్బందితో వచ్చి ఆందోళన విరమింపజేశారు.

అధికారుల తీరుకు నిరసనగా వైసిపి ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు బాహుద్దీన్

ప్రజాశక్తి, కదిరి టౌన్

మున్సిపల్ అధికారుల తీరుకు నిరసనగా వైసిపి నాయకులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. పట్టణంలోని పదో వార్డు కౌన్సిలర్ దిల్షా దున్నిసా, వైసిపి నాయకులు బాహుద్దీన్ వార్డు ప్రజలతో కలసి ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి గత ఎన్నికల్లో సిద్ధారెడ్డి గెలుపునకు కషి చేసిన సొంత పార్టీ కార్యకర్తల పైనే విషం కక్కుతున్నారని ఆ పార్టీ నాయకులు విషం కక్కుతున్నారన్నారు. ఎమ్మెల్యే తప్పులను ప్రశ్నిస్తే అధోగతే అని విమర్శించారు. ఇదిలా ఉండగా బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేరుస్తున్న వాలంటర్లను అకారణంగా తొలగించడం అన్యాయమన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పదో వార్డు కౌన్సిలర్ దిల్షా దున్నిసా తమ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమావేశంలో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారన్నారు. బాధ్యతగా విధులు నిర్వహిస్తున్న వాలంటర్లను రాజకీయ ప్రలోభాలకు గురై తొలగించడం సబబు కాదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. ఆ సమయంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మునిసిపల్ శాఖ అధికారులు పట్టించుకోలేదన్నారు. దీంతో అధికారుల తీరుకు నిరసనగా మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వ పథకాలను సక్రమంగా. ప్రజలకు చేరుస్తున్న వాలంటర్లను ఎందుకు తొలగించారో తెలపాలని డిమాండ్ చేశారు. జగనన్న ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని పరోక్షంగా స్థానిక ప్రజా ప్రతినిధి పై ఆరోపణలు గుప్పించారు. సమస్యను పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హాకీ రాష్ట్ర జట్టులో ధర్మవరం క్రీడాకారులు

ధర్మవరం టౌన్ : ఒరిస్సా రాష్ట్రంలోని రూర్కెలా లో ఈనెల 18 నుంచి 28 వరకు నిర్వహించే 13వ జాతీయ సబ్ జూనియర్ బాలుర హాకీ ఛాంపియన్ షిఫ్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ హాకీ రాష్ట్ర జట్టుకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు, హాకీ సత్యసాయి జిల్లా కార్యదర్శి సూర్యప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరం హాకీ క్రీడాకారులు రాష్ట్ర జట్టులో ఎంపిక కావడం హర్షనీయమన్నారు. వీరి ఎంపిక పట్ల సూర్య ప్రకాష్ తో పాటు శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు బండి వేణుగోపాల్, పళ్లెం వేణుగోపాల్, ఉడుముల రామచంద్ర, గౌరీ ప్రసాద్, అంజన్న, అరవింద్ గౌడ్, జెన్నే చందు, అస్లాం, మారుతీ, కిరణ్, శ్రీ సత్యసాయి జిల్లా హాకీ కోచ్ హసేన్ తోపాటు సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో క్రికెట్ పండుగకు శ్రీకారం

బత్తలపల్లి : రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో క్రికెట్ పండుగకు శ్రీకారం చుట్టారు. పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్‌కి రాప్తాడు, ధర్మవరం సూపర్ లీగ్ (ఆర్‌డిఎస్ఎల్)గా నామకరణం చేశారు. క్రికెట్ ఆడదలచిన జట్లు ఈనెల 15 వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు. సెమిఫైనల్ వరకు చేరుకున్న మండల స్థాయి జట్లకు పదివేల రూపాయల నగదు, క్రికెట్ కిట్ బహుమతిగా ఉంటుందన్నారు. అలాగే ఐపీఎల్ తరహాలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన మూడు జట్లకు ఒక లక్ష, 50వేలు, 25 వేల రూపాయలు చొప్పున బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పోటీలు క్రీడా స్ఫూర్తిని పెంపొందించే విధంగా ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్ ల కోసం నామమాత్రంగా 500 రూపాయల రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఎస్ఎల్ మండల స్థాయి నిర్వాహకుడు నెట్టెం రమణ, సురేంద్ర నాయుడు, రంగానాయుడు, తాళ్లూరి సతీష్, ప్రతాప్, ఐడిడిపి హరి, వీర, రామానాయుడు,మోహన్, వడ్డే బొజ్జి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై అలసత్వం తగదు

పుట్టపర్తి రూరల్ : పలు సమస్యలతో జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చు ఫిర్యాదుదారుల పట్ల అలసత్వం వహించరాదని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. పుట్టపర్తి లోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాధవ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనలో జిల్లా నలుమూలల ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. పోలీసు పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని స్పందన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఎస్పీ సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కెవి.రామకృష్ణ ప్రసాద్, ఎస్‌బి డిఎస్పి ఉమా మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి : పల్లె

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలో ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం వరకు చేపట్టిన జాతీయ రహదారికి భూములు, ఇల్లు కోల్పోతున్న బాధితులకు న్యాయపరమైన నష్టపరిహారం అందించాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం బుక్కపట్నం మండలం బుచ్చయ్య గారి పల్లి, చంద్రాయుని పల్లికి చెందిన రైతులు, గృహాలు కోల్పోతున్న బాధితులతో కలసి జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ జాతీయ రహదారికి బుచ్చయ్య గారి పల్లిలో 58 గృహాలు కోల్పోతున్నారన్నారు. వారందరికీ 2013 భూ సేకరణ చట్ట ప్రకారం తగిన ధరను చెల్లించాలన్నారు. పునరావాస చట్టం కింద వారికి ఇళ్ల స్థలాలు చూపించి ప్రభుత్వమే ఇల్లు నిర్మించాలన్నారు. ప్రస్తుత ధరల మేరకు విలువ కట్టి న్యాయమైన పరిహారం అందించాలన్నారు. బాధితుల అనుమతి మేరకే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఈ రహదారి కోసం విలువైన పండ్ల తోటలు కోల్పోవాల్సి వస్తోందన్నారు. ఆ రైతులందరి అనుమతి తర్వాతనే తగిన ధర చెల్లించాలన్నారు. గృహాలు కోల్పోతున్న స్థలాలు రహదారి పక్కనే ఉన్నందున సెంటు ధర రూ. 5 లక్షలు పలుకుతోందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సరైన నష్టపరిహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ మాట్లాడుతూ, బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బుక్కపట్నం మండల టిడిపి కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, శివ, జయరాం, సురేంద్రబాబు, అంబులెన్స్ రమేష్, పలువురు బాధితులు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న పల్లె, తదితరులు